బడిబాట భళా..!

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో అనూహ్య స్పందన

- ప్రభుత్వ పాఠశాలల్లో 1,976 మంది విద్యార్థుల చేరిక
- ఈ నెలాఖరు వరకు కార్యక్రమం పొడిగింపు
- ప్రైవేట్‌లో ఫీజులు..పుస్తకాల మోతతో మారిన తల్లిదండ్రుల వైఖరి
- సర్కారు బడుల్లో ఇంగ్లిషు మీడియం సహా ఇతర వసతులూ కారణం



సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో బడిబాట కార్యక్రమానికి అనూహ్య స్పందన లభిస్తోంది. ఈ నెల 3 నుంచి 9 వరకు ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల (విద్యార్థుల) పేర్లు నమోదును చేపట్టిన విద్యాశాఖ 12 నుంచి 19 తేదీ వరకు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి స్పందన వస్తుండడంతో ఈ నెలాఖరు వరకు విద్యాశాఖ పొడిగించింది. జిల్లా విద్యాశాఖ చేపట్టిన బడి బాట కార్యక్రమంలో ఇప్పటి వరకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 1,976 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. ఇందులో ఒకటో తరగతిలో 1,194 విద్యార్థులు చేరగా, 2 నుంచి 10 వ తరగతిలో 782 మంది విద్యార్థులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు క్రమంగా ఆదరణ..

ప్రభుత్వ పాఠశాలలకు క్రమంగా ఆదరణ పెరుగుతోంది. కరోనా కష్ట కాలం నుంచి మొదలు.. ప్రైవేట్, కార్పొరేట్‌ల్లో ఫీజులు.. పుస్తకాల మోతతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన తల్లిదండ్రుల ఆలోచనా విధానంలోనూ మార్పు వచ్చింది. దీనికితోడూ ప్రభుత్వం సర్కారు బడుల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలతో విద్యార్థుల తల్లిదండ్రుల ప్రభుత్వ పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారు.

మండలాల వారీగా..

జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తంగా 1,976 మంది విద్యార్థులు చేరారు. ఇందులో మేడ్చల్ మండలంలో 140 మంది విద్యార్థులు, కూకట్‌పల్లిలో 538, బాలానగర్‌లో 297, అల్వాల్‌లో 129, మల్కాజిగిరిలో 152, మేడిపల్లిలో 123, కాప్రాలో 24, శామీర్‌పేటలో 140, కీసరలో 148, ఘట్‌కేసర్‌లో172, మూడుచింతలపల్లిలో 117 విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు.

ప్రభుత్వ బడులకు ఆదరణ పెరిగిందిలా..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయాలకు తగ్గట్టుగా ప్రభుత్వం అన్నీ ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశ పెట్టింది. అలాగే మనఊరు-మన బడి-మన బస్తీ కార్యక్రమం కింద మొదటి విడతలో 176 ప్రభుత్వ బడుల్లో రూ.70 కోట్లతో మరమ్మతులు, మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టారు. జిల్లాలో ఇప్పటివరకు 35 పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు.అలాగే, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో రూ.12.50 కోట్లతో 286 ప్రభుత్వ బడుల్లో మరమ్మతులు చేపడుతున్నారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతుండడంతో పాటు విద్యార్థులకు ఏకరూప దుస్తులు, ఉచిత పుస్తకాల పంపిణీ , మధ్యాహ్న భోజన పథకం వంటి సదుపాయాలను బడి బాట కార్యక్రమం ద్వారా జిల్లా విద్యాశాఖ ప్రచారం చేస్తోంది.

కరోనా నేర్పిన పాఠం..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో కరోనా కష్ట కాలంలో 2021-22 విద్యా సంవత్సరంలో 515 ప్రభుత్వ పాఠశాలల్లో 9,718 మంది విద్యార్థులు చేరారు. ఇందులో ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు 3,408 మంది ఉన్నారు. అలాగే 2022-23లో జిల్లాలో కొత్తగా ప్రభుత్వ పాఠశాలల్లో 793 మంది చేరగా, ఇందులో ప్రైవేట్ విద్యా సంస్థల నుంచి వచ్చి చేరిన విద్యార్థులు 339 మంది ఉన్నారు.

ఏసీఈ కళాశాలలో నాసా యాప్ చాలెంజ్ హ్యాకథాన్


హ్యాకథాన్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ బీఎల్ రాజు, సాయికిరణ్

ఘట్‌కేసర్: అంకుషాపూర్ ఏసీఈ కళాశాలలో ఫౌండర్ ల్యాబ్, ఎస్‌యూఎంవీఎన్ సౌజన్యంతో సోమవారం 24 గంటల నాసా యాప్ చాలెంజ్-2024 హ్యాకథాన్‌ను నిర్వహించారు. ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎల్ రాజు, ఎస్‌యూఎంవీఎన్ ఫౌండర్ సాయికిరణ్‌తో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థులు స్పేస్ టెక్నాలజీకి సంబంధించిన యాప్‌లను అభివృద్ధి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాప్‌లు డెవలప్ చేసి సాంకేతిక నైపుణ్యం సంపాదించుకునేందుకు హ్యాకథాన్ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టెక్నాలజీని అభివృద్ధి చేసి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యాపకులు దుర్గా ప్రసాద్, శ్రవణ్, శ్రీలత, హెచ్‌ఓడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోదండరాం పరామర్శ


ఎమ్మెల్యే సత్యంను ఓదారుస్తున్న కోదండరాం

అల్వాల్: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను మంగళవారం తెలంగాణ జనసమితి అధినేత ప్రొఫెసర్ కోదండరాం పరామర్శించారు. ఎమ్మెల్యే సత్యం భార్య ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా అల్వాల్ పంచశీల కాలనీలోని ఎమ్మెల్యే నివాసానికి కోదండరాం వెళ్లి ఓదార్చారు. సురేందర్‌రెడ్డి, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో భరోసా

కీసర: ఆపదలో ఉన్నవారికి సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో భరోసా కల్పిస్తున్నదని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. నాగారం మున్సిపాలిటీకి చెందిన కవితకు ఆసుపత్రిలో చికిత్స కోసం సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ 2,10,000 మంజూరు కాగా సంబంధిత ఎల్‌ఓసీ పత్రాన్ని ఆమెకు అందజేశారు. ఆయన వెంట వైస్‌చైర్మన్ బండారి మల్లేశ్‌యాదవ్, కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


ఎల్‌ఓసీ పత్రం అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి


కుట్టుమిషన్ల పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే

కీసర: మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. నాగారం మున్సిపాలిటీలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో ఎస్సీ కార్పొరేషన్, ప్రో ఫ్యాషన్ అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 3 నెలల పాటు 70 మంది మహిళలకు ఇచ్చిన ఉచిత కుట్టుమిషన్ శిక్షణ పూర్తవగా మంగళవారం కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళలు స్వయం ఉపాధిరంగాల్లో రాణిస్తే ఆ కుటుంబానికి ఎంతో భరోసాగా ఉంటుందన్నారు. భవిష్యత్‌లోనూ ప్రో ఫ్యాషన్ అభయ ఫౌండేషన్ ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ బండారి మల్లేశ్ యాదవ్, కౌన్సిలర్లు, కోఆప్షన్‌సభ్యులు, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు తేళ్ల శ్రీధర్, అభయ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పార్కు నిర్వహణలో అలసత్వం వద్దు


మొక్కలను పరిశీలిస్తున్న మేయర్ శాంతి, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్

జవహర్‌నగర్: పార్కు నిర్వహణలో అలసత్వం వద్దని మేయర్ శాంతి, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ చెన్నాపురంలో హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పార్కును మంగళవారం వారు సందర్శించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గొడుగు వేణు, నవీన్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కృష్ణప్ప, సందీప్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ దీపిక, కౌన్సిలర్ మానస

మేడ్చల్: ఒకటో వార్డు ఆర్టీసీ కాలనీలోని రోడ్ నంబర్-5 లో సీసీ రోడ్డు పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ దీపిక కౌన్సిలర్ మానసతో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డులోని అన్ని వీధుల్లో సీసీ రోడ్ల పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ నాగిరెడ్డి, డీఈ విజయలక్ష్మి, వార్డులోని వివిధ పార్టీల నాయకులు ప్రమోద్, పవన్, శ్రీరాంరెడ్డి పాల్గొన్నారు.

చలో ఢిల్లీని జయప్రదం చేయండి

మల్కాజిగిరి: ఈపీఎఫ్ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి త్వరలో జరిగే చలో ఢిల్లీని జయప్రదం చేయాలని టాప్రా (తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోషియేషన్) రాష్ట్ర అధ్యక్షుడు నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. మల్కాజిగిరిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆలిండియా కమిటీ మేరకు పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి చేపట్టిన కార్యాచరణలో భాగంగా సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆగస్టు 6 నుంచి 9వ తేదీ వరకు జంతర్ మంతర్ వద్ద జరిగే ధర్నాలో పాల్గొనడంతో పాటు పార్లమెంట్‌లో ప్రస్తావించాలని కోరుతూ పార్లమెంట్ సభ్యులకు ఆయా జిల్లాల బాధ్యులు వినతిపత్రాలు అందజేస్తారన్నారు. నాయకులు బాల గంగాధర్, అశోక్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఓఆర్‌ఆర్‌పై సిలిండర్ల వ్యాన్ బోల్తా



కీసర: గ్యాస్ సిలిండర్లను తరలిస్తున్న వ్యాన్ యాద్గార్‌పల్లి గ్రామ సమీపంలో మంగళవారం బోల్తా పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్‌లోని భారత్ గ్యాస్ ఏజెన్సీ నుంచి పెద్దసైజ్ గ్యాస్ సిలిండర్లను తీసుకుని ఐడీఏ బొల్లారం ఇండస్ట్రీస్ ఏరియాకు వెళ్తుండగా కీసర ఓఆర్‌ఆర్‌పై యాద్గార్‌పల్లి సమీపంలో బోల్తాకొట్టింది. ఈ ఘటనలో సిలిండర్లు ఓఆర్‌ఆర్‌పై పడిపోయాయి. విషయం తెలుసుకున్న కీసర పోలీసులు, ఘటనా స్థలానికి చేరుకుని సిలిండర్లను మరో వ్యాన్‌లో తరలించారు. డ్రైవర్ శ్రీని వాస్‌గౌడ్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

మేడ్చల్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో డీసీఎం డ్రైవర్ మృతి చెందాడు. మేడ్చల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం తెల్లవారుజామున ఓఆర్‌ఆర్‌పై పటాన్‌చెరు నుంచి మేడ్చల్ వైపు వస్తున్న డీసీఎం సుతారిగూడ పరిధిలో ఆగి ఉన్న కంటైనర్ వాహనాన్ని వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో డీసీఎం డ్రైవర్ వాహనం దిగి తనిఖీ చేస్తుండగా అదే సమయంలో వెనుక నుండి వచ్చిన మరో కంటైనర్ వాహనం డ్రైవర్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మేడ్చల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడు గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి సు తారిగూడ గ్రామానికి చెందిన రవికుమార్‌గా గుర్తించి మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ధరణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలి

జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

సాక్షి,మేడ్చల్ జిల్లా: ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కీసర ఆర్డీవో కార్యాలయాన్ని మంగళవారం సందర్శించారు.



రెవెన్యూ అధికారులతో పాటు ఆపరేటర్లను ధరణి దరఖాస్తులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని మాడ్యుల్స్ సక్సేషన్, పెండింగ్ మ్యూటేషన్ వంటి దరఖాస్తులకు సంబంధించి అవసరమైన రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించి గడువులోగా పరిష్కరించాలన్నారు. డేటా కరెక్షన్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టిన తర్వాతే పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ భూములను అక్రమంగా కబ్జా చేస్తే క్షేత్రస్థాయిలో పరిశీలించి వారిపై చట్టపరంగా క్రిమినల్ కేసులు పెట్టాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో కీసర ఆర్డీఓ ఉపేందర్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్ !



కుషాయిగూడ: ఇటీవల కురిసిన వర్షాలకు మ్యాన్‌హోల్స్ దెబ్బతిని ప్రమాదకరంగా మారాయి. కుషాయిగూడ, శ్రీ సాయికృష్ణ ఎన్‌క్లేవ్ సమీపంలో ఓ మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు మ్యాన్‌హోల్ కుంగిపోయిందని కాలనీ అధ్యక్షుడు కుమారస్వామి తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి కాలనీలో కుంగిపోయిన మ్యాన్‌హోల్స్‌కు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

నూతన లా కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, సిటీబ్యూరో: చెన్నైకి చెందిన శివ్ నాడార్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో శివ్ నాడార్ స్కూల్ ఆఫ్ లాను కొత్తగా ప్రారంభించారు. ఈ విషయాన్ని సంస్థ నగర ప్రతినిధులు తెలిపారు. ప్రపంచస్థాయి మౌలిక వసతులు, ప్రపంచ స్థాయి వర్సిటీల్లో శిక్షణ పొందిన ఫ్యాకల్టీలు ఈ స్కూల్ ప్రత్యేకతలన్నారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అనుమతి పొందిన ఐదేళ్ల ఎల్‌ఎల్‌బీ కోర్సును ఈ స్కూల్ అందిస్తోందని ఆసక్తి కలిగిన నగరవాసులు జులై 10వ తేదీలోపు snuchennaiadmissions.com/application-form-for-school-of-law దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

హబ్సిగూడ: హబ్సిగూడ డివిజన్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో కాలేరు యమునాబాయి ట్రస్ట్, కాలేరు జైనవీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యమునబాయి ట్రస్ట్ సేవలు అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పుష్ప, బీఆర్‌ఎస్ నాయకులు పసూల ప్రభాకర్‌రెడ్డి, గంధం నాగేశ్వర్‌రావు, కాలేరు సుధాకర్, అజిత్‌రెడ్డి, సూరం శంకర్, చాంద్‌పాషా, పవన్, అద్విత్, శ్యామ్, నాని, చందు, లక్ష్మణ్‌రావు, లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

మౌలాలి: మొక్కలు నాటి సంరక్షించాలని మల్కాజిగిరి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ అన్నారు. మంగళవారం షేర్ అబ్రారీల్లా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఓల్డ్ సఫిల్‌గూడలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో మొక్కలు, ప్లాస్టిక్ వాడకం నిషేదంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఇన్‌స్పెక్టర్ శివశంకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు మైనర్లకు ద్విచక్ర వాహనాలను ఇవ్వకూడదని సూచించారు. అనంతరం అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు విజయ అర్చన, ఎన్విరాన్‌మెంట్ బోర్డు మెంబర్ జగన్, పాఠశాల డైరెక్టర్ చంద్రమౌళి, పాఠశాల ప్రిన్సిపాల్ జాన్ సురేష్‌బాబు పాల్గొన్నారు.

ప్రథమ చికిత్స కేంద్రాల సీజ్

- నకిలీ వైద్యులపై ఎఫ్‌ఐఆర్ నమోదు
- డీఎంహెచ్‌ఓ రఘు ,వైద్యాధికారులు



సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని బోడుప్పల్ శివ బాలాజీ , కొర్రెములలోని ఆర్‌ఆర్ ప్రథమ చికిత్స కేంద్రాలను జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్.రఘునాథ్ స్వామి మంగళవారం సీజ్ చేశారు. అలాగే, సంబంధిత నకిలీ వైద్యులపై చర్యలకు ఆదేశించడంతో స్థానిక పోలీసులు వారిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. రాష్ట్ర వైద్య మండలి చైర్మన్ ఆదేశాలతో మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లాలో నకిలీ వైద్యులు అల్లోపతి వైద్యం చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించినట్లు డీఎంహెచ్‌ఓ పేర్కొన్నారు. అర్హతలు లేకపోయినప్పటికీ, పలువురు నకిలీ డాక్టర్ల అవతారమెత్తి, అల్లోపతి మందులు రాస్తూ.. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనలు, టీఎస్‌ఎంసీ చట్టం ప్రకారం నకిలీ వైద్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీల్లో జిల్లా డిప్యూటీ వైద్యారోగ్య అధికారి డాక్టర్ నారాయణరావు, కీసర డివిజన్ డాక్టర్ శోభన, నారాపల్లి వైద్యాధికారి పాపాని శ్రీనివాస్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, పోలీసు శాఖ అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో ప్రత్యేక మహిళా సభలు

- మహిళా శక్తిలో భాగంగా 61 జీపీల్లో నిర్వహణ
- సచివాలయంలో మేడ్చల్ మహిళా సంఘంతో క్యాంటీన్ ఏర్పాటు
- మహిళా సంఘాల్లో కొత్తగా 1,948 సభ్యుల చేరికపై కసరత్తు
- జిల్లాలో 16 మీ-సేవ కేంద్రాలను మహిళా సంఘాలకు అప్పగించేలా ప్రణాళిక



సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక మహిళా గ్రామ సభలను మంగళవారం నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా 61 గ్రామ పంచాయతీల్లో సభలు ఏర్పాటు చేసినట్లు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ) అధికారి సాంబశివరావు తెలిపారు. మహిళా సంఘం, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ఇప్పటివరకు సంఘంలో లేని మహిళలను గుర్తించి చేర్పించడం, మైక్రో ఎంటర్‌ప్రైజెస్‌లను గుర్తించి ప్రోత్సహించడం వంటి చర్యలు తీసుకోవాలని సభల్లో నిర్ణయించారు. అలాగే, కుట్టు శిక్షణ కేంద్రాలు, పాడి పరిశ్రమలు, పౌల్ట్రీ, మదర్ యూనిట్ల ఏర్పాటు, డెయిరీ పార్లర్లు, మొబైల్ ఫిష్ రిటైల్ అవుట్‌లెట్లు, ఈవెంట్ మేనేజ్‌మెంట్, మహిళా క్యాంటీన్లు, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి యూనిట్లను ఎంపిక చేసినట్లు డీఆర్డీఏ అధికారులు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే మహిళా శక్తి కార్యక్రమం కింద జిల్లాలోని ప్రభుత్వ బడుల్లోని విద్యార్థులకు యూనిఫాంలు కుట్టించడంలో సఫలీకృతులైన విషయాన్ని ఈ సందర్భంగా అధికారులు ప్రస్తావించటంతో పాటు మహిళలను ప్రసంశించారు.అలాగే విద్యార్థులకు రెండో జత యూనిఫాంలు కూడా కుట్టేందుకు మహిళా సంఘాలను సన్నద్ధం చేసినట్లు పేర్కొన్నారు. తెలంగాణ సచివాలయంలో రెండు మహిళా క్యాంటీన్లను ఏర్పాటు చేస్తే ..అందులో ఒకటి మేడ్చల్ మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు చేసే అవకాశం లభించడంతో జిల్లాకు మంచి గుర్తింపు వస్తుందని అధికారులు తెలిపారు. అలాగు బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ఆసుపత్రులు, టూరిజం స్పాట్‌లు, ఆలయాలు, ఇండస్ట్రియల్ ఏరియాలో మహిళా క్యాంటీన్లు ఏర్పాటు చేస్తే తప్పనిసరిగా సఫలీకృతమవుతామని గ్రామ సభల్లో పలువురు మహిళలు అభిప్రాయపడినట్లు డీఆర్‌డీఏ వర్గాలు తెలిపాయి. కొత్తగా ఏర్పడిన మహిళా సంఘాల సభ్యులను గుర్తించి వారిని గ్రూపుల్లో చేర్పించి, బ్యాంకు అకౌంట్లు ఓపెన్ చేయాలని నిర్ణయించారు. జిల్లాలో కొత్తగా 1,948 మందిని సభ్యులను గ్రూపుల్లో చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అలాగే ఈ ఏడాదిలో జిల్లాలో 16 మీ-సేవ కేంద్రాలను మహిళా సంఘం సభ్యులతో ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని నిర్ణయించారు.

సకాలంలో వేతనాలు చెల్లించాలి


నిరసన తెలుపుతున్న 1962 సిబ్బంది

మేడ్చల్: సకాలంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ 1962 అంబులెన్స్ పశు వైద్య సంచార సిబ్బంది మేడ్చల్‌లో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గానికి ఒక అంబులెన్స్ కేటాయించగా నిత్యం తాము అంతటా పర్యటించి మూగజీవాలకు వైద్య సేవలందిస్తున్నామన్నారు. అయితే కొన్ని నెలలుగా తమకు సక్రమంగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వేతనాలు అందేలా చూడాలని కోరారు. నిరసనలో పశు వైద్యురాలు దివ్యశ్రీ, సిబ్బంది అనిల్‌కుమార్, రోహిత్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్‌లో పనులు వేగవంతం చేస్తామని కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. బలరాంనగర్‌లో సుమారు రూ.15 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం కృపా కాంప్లెక్స్ ప్రాంతంలోని ఎస్టీపీ ప్లాంట్ పరిసరాల్లో నాలా పూడికతీత పనులను పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఎన్నికలు, ఇతర కారణాలతో పనుల్లో జాప్యం జరిగిందని, ఇప్పటికైనా పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. డీఈ మహేష్, ఏఈ దీపక్, వీఐ.రమేష్, ఎంటమాలజీ అధికారి దుర్గాప్రసాద్ తదితరులున్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

కీసర: రుణాలను సద్వినియోగం చేసుకోవాలని భోగారం ఎంపీటీసీ సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి సూచించారు. గ్రామంలో మంగళవారం నిర్వహించిన మహిళా శక్తి గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న రోజుల్లో డ్వాక్రా సంఘాల మహిళలకు మీసేవ కేంద్రాలు, భోజన క్యాంటీన్లు, చేపల వ్యాపారం, పాడి పశువుల పెంపకం తదితర రంగాల్లోనూ ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రుణాలు అందించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సీసీ సుదర్శన్‌రెడ్డి, గ్రామ కార్యదర్శి శ్రీరామ్, మహిళా సంఘాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ప్రసాద్, వసంతక్కకు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న నాయకులు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని మా గృహలక్ష్మీ సంఘం ఆవరణలో ఐపీడబ్ల్యూ మెరుగు పుణ్యవతి ఆధ్వర్యంలో ప్రసాద్, వసంతక్కల వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. సీపీఐ (ఎంఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి మల్లెపల్లి ప్రభాకర్ హాజరై ప్రసాద్, వసంతక్క చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. భూమి, భుక్తి, విముక్తి కోసం పోరాడిన గోదావరిలోయ విప్లవ ప్రతిఘటనోద్యమ నాయకులు ప్రసాద్, వసంతక్క అని కొనియాడారు. కార్యక్రమంలో షేక్ షావలీ, సంపంగి పద్మ, చిట్టిబాబు, సునీత, నర్సన్న, రషీద్, ద్రావిడ, వెంకటేశ్వర్లు, సిద్ధి రాజు తదితరులు పాల్గొన్నారు.

సన్‌రైజ్ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న వీరారెడ్డి, సందర్‌రావు తదితరులు

ఘట్‌కేసర్: అనారోగ్యంతో బాధపడుతున్న ఎన్‌ఎఫ్‌సీనగర్‌కు చెందిన పాపారావుకు సన్‌రైజ్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు మంగళవారం రూ. 10 వేల ఆర్థిక సాయం అందజేశారు. పాపారావు మతిస్థిమితం లేక ఎర్రగడ్డలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పాపారావు తండ్రి భీమారాజు ఇటీవల పక్షవాతంతో నిమ్స్‌లో చికిత్స పొందాడు. నిరుపేదలు కావడంతో పాపారావు తల్లికి సాయం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సందర్‌రావు, వీరారెడ్డి, శ్రీకాంత్, ఐలయ్య, దేవానంద్, సోమయ్య, మల్లవయ్య, శ్రీరాములు, బాలత్రిపుర సుందరి పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయులుగౌడ్ బర్త్ డే


వేడుకలు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, నేతలు, అభిమానులు

కీసర: నాగారం మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ సీనియర్ నేత గూడూరు ఆంజనేయులుగౌడ్ (అంజన్న) జన్మదిన వేడుకలను బీఆర్‌ఎస్ నాయకులు, వివిధ కాలనీవాసుల సమక్షంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు, నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషుల మధ్య ఆంజనేయులుగౌడ్ కేక్ కట్ చేశారు. ఇలాంటి జన్మదిన వేడుకలను మరిన్ని జరుపుకోవాలని పలువురు నేతలు ఆకాంక్షించారు. కార్యక్రమంలో మధుగౌడ్, పాషాబాయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ గిరిజన వసతిగృహం సందర్శన

కీసర: నాగారం మున్సిపాలిటీలోని ప్రభుత్వ గిరిజన కళాశాల వసతి గృహాన్ని టీఎస్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివానంద్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాసిరకమైన ఆహారాన్ని పెడుతున్నారన్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇక్కడ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు వసతిగృహాన్ని సందర్శించి సమస్యలు పరిష్కరించాలని లేకుంటే పెద్ద ఎత్తున ధర్నా చేపడుతామని హెచ్చరించారు.